
బాలల

# చంద్రప్రభ


మాసపత్రిక

అక్టోబరు 2016

రూ. 20/-



## శ్రీమతి రావినూతల సువర్ణాకన్నన్‌గారి
## అద్భుత సీరియల్ స్వర్ణసింహాసనం



# మంచిమార్గం

- ప్రతాప వెంకట సుబ్బారాయుడు, సికింద్రాబాద్

రాజయ్య భూషయ్య ఒకే వీధిలో ఉంటారు.

ఒకనాటి సాయంకాలం రాజయ్య సంత వీధిలోంచి వస్తుంటే విచారంగా వున్న భూషయ్య కనిపించాడు. రాజయ్య 'విషయమేంటని' అడిగాడు.

'మా అబ్బాయి అవలీలగా అబద్ధాలు చెప్పేస్తున్నాడు. బడికెళ్ళకుండానే వెళ్ళానని, అమ్మ అడిగిందని నన్ను, నేను అడిగానని వాళ్ళమ్మని డబ్బులడిగి ఇష్టమొచ్చినట్టు ఖర్చుపెడుతున్నాడు. 'ఎందుకలా చేస్తున్నావని' అడిగితే నిర్లక్ష్యంగా సమాధానాలు చెబుతున్నాడు. ఒక్కగానొక్క కొడుకు పాడైపోతున్నాడని మనసులో మదన పడిపోతున్నాను' చెప్పాడు భూషయ్య.

'భూషయ్యా, నేను నీకో విషయం చెప్పాలని చాలాకాలంగా అనుకుంటున్నాను. ఇప్పుడు సరైన సమయం వచ్చింది. అబద్ధం ఆడే అలవాటు నీకు మాత్రం లేదా, నిజాయితీగా చెప్పు. నువ్వు అప్పులు చేస్తావని, వసూలు చేసుకోవడానికి నీ ఇంటికొచ్చేవాళ్ళకి రకరకాల సాకులు, అబద్ధాలు చెబుతావని అందరూ అనుకోవడం చాలాసార్లు విన్నాను. నీ ప్రభావం నీ పిల్లాడి మీద పడడంలో వింతేముంది. పెద్దల్ని బట్టే కదా పిల్లలు. నువ్వు అబద్ధాలు ఆడేటప్పుడు నీ పిల్లాడు నిన్ను గమనిస్తున్నాడని బహుశా నువ్వు అనుకుని వుండవు. అదే ఇంత వరకు తెచ్చింది. అబద్ధాలు ఆడేవాళ్ళని సమాజం చిన్నచూపు చూస్తుంది. నమ్మకస్తులవైపే వుంటుంది. చిన్నపిల్లాడైన నీ కొడుకువల్ల నీలో ఇంత మనస్థాపం కలిగితే! రేపు వాడు పెరిగి పెద్దయ్యాక సంఘానికి ఎంత క్షోభ కలిగిస్తాడు? చిన్న పిల్లల పాలన పోషణలో అందుకే క్రమశిక్షణ, సమయపాలన, నిజాయితీ రంగరించాలి. అప్పుడే వాళ్ళు ఆదర్శవంతంగా ఎదుగుతారు. పెద్దలకి పేరు ప్రతిష్ఠలు తీసుకువస్తారు. నువ్వు సరైన సమయంలో కళ్ళు తెరవడం మంచిదయింది. లేకపోతే మరింత పతనమయ్యేవాడు. రేపటి నుండి వాడిని నా దగ్గరకు పంపు. మంచి మార్గంలో పెట్టడానికి నా ప్రయత్నం నేను చేస్తాను.

భూషయ్య 'సరే' అన్నట్టుగా తలూపాడు. మనసులోని భారం తీరిన ఆనందంతో.

**ఆత్మకు జాతి, లింగ భేదాలు లేవు ఆత్మ నిష్కళంకమైనది.**
**మానిసజాతికి పుట్టుకతో వచ్చేది అసూయ.**
**నవీన భౌతిక శాస్త్రవేత్తల భయంకరమైన దాడికి నిలబడి వేదాలు మిగిలి వున్నవి.**